## ప్రజా సమస్యలపై పోరాడుతున్న వారిపై అక్రమ కేసులా..?

### తెలంగాణలో బీజేపీ వస్తేనే అభివృద్ధి జరుగుతుంది

బీఆర్ఎస్ రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తుందని కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ మండిపడ్డారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న తమ కార్యకర్తలపై బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధిస్తుందని విమర్శించారు. గంగుల కమలాకర్ మూడుసార్లు గెలిచి... కరీంనగర్‌కు చేసిందేమీ లేదన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తేనే.. అభివృద్ధి జరుగుతుందన్నారు బండి సంజయ్.





## పదేళ్లు అవకాశం ఇస్తే కేసీఆర్ ప్రజలకు చేసిందేమీ లేదు

### టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి

వనపర్తి : తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ప్రజలను కోరారు. పదేళ్లు కేసీఆర్‌కు అవకాశం ఇస్తే ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. భారాసకు మరోసారి అవకాశం ఇస్తే తెలంగాణ పరిస్థితిని ఊహించలేమన్నారు. వనపర్తిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఇకపై అభివృద్ధి కోసం ఎవరి దగ్గరో చేతులు చాచాల్సిన అవసరం లేదు. మన అభివృద్ధి, మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంది. వనపర్తికి పరిశ్రమలు రావాలంటే ఇక్కడ కాంగ్రెస్ గెలవాలి. పాలమూరు జిల్లాను రాష్ట్రానికే ఆదర్శంగా తీసుకునేలా ప్రజల నిర్ణయం ఉండాలి. తెలంగాణ వస్తే రైతులు, నిరుద్యోగుల ఆత్మహత్యలు ఉండవు అనుకున్నాం. సింగరేణి, విద్యుత్ కార్మికులు తమ బతుకులు బాగుపడతాయని అనుకున్నారు. దళితులు, గిరిజనులు ఆత్మగౌరవంతో బతకాలనుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు. కేసీఆర్ కుటుంబం.. భారాస నేతల కలలు మాత్రమే నెరవేరాయి. తెలంగాణ తీసుకొచ్చామని చెప్పిన వారికి పదేళ్లు అవకాశం ఇచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ గెలవాలి. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరుతామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

# ఇందిరమ్మ రాజ్యంలో అంతా అరాచకాలే..

### వైరా నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్

వైరా (వాయిస్ టుడే): ఇందిరమ్మ రాజ్యంలో అంతా అరాచకలే.. పేదోళ్లు పేదోళ్లగానే ఉండిపోయారు.. మళ్లా ఆ దరిద్రం పాలన మనకెందుకు..? అని సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. వైరా నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని మదన్‌లాల్‌కు మద్దతుగా ప్రసంగించారు.




కాంగ్రెస్‌కు అధికారం వస్తే ఇందిరమ్మ రాజ్యం తెస్తమని చెబుతున్నారు. ఎందుకు ఆ దిక్కుమాలిన పరిపాలన. ఏం ఉద్ధరించారు అని, ఆనాడు ఎవ్వళ్లు బాగుపడ్డారని, అంతా అరాచకాలు, పేదోళ్లు పేదోళ్లగానే ఉండిపోయారు. ఎస్టీలు, ఎస్సీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారు. ఏం చేయలేదు. చేస్తే దళిత, గిరిజనుల పరిస్థితి ఇట్ల ఉండేది కాదు. స్వాతంత్ర్యం వచ్చిన నాడే వారు ఆలోచించి ఉంటే ఈపాటికి దళిత, గిరిజన వర్గాలు బాగుపడాలి. కానీ జరగలేదు. ఇందిరమ్మ పాలనలోనే ఎమర్జెన్సీ వచ్చింది. ప్రతిపక్షాలను పట్టుకుపోయి జైల్లో వేసి చాలా దుర్మార్గమైన చీకటి రోజులు తెచ్చారు. మళ్లా ఆ దరిద్రం పాలన మనకెందుకు అవసరమే లేదు. బీఆర్ఎస్ వచ్చిన తర్వాత సమీక్షలు జరిపి ఒక దారి పట్టాం. పేదల సంక్షేమం చేశాం అని కేసీఆర్ తెలిపారు.

**ఇవాళ మంచినీటి బాధలు తీరాయి..**

గోదావరి దగ్గర ఉన్నప్పటికీ మంచినీళ్లు ఇవ్వడం చేతకాలేదు కాంగ్రెస్ పార్టీకి. అసెంబ్లీలో నేను చెప్పాను.. ఐదేండ్లలో మిషన్ భగీరథ కంప్లీట్ చేసి ప్రతి ఇంటికి నల్లా పెట్టి నీళ్లు ఇవ్వకపోతే వచ్చే ఎన్నికల్లో మేం నిలబడం, ఓట్లు అడగం అని చెప్పినం. ఛాలెంజ్ చేసి, వెంబడిపడి, పట్టువట్టి దాన్ని తీసుకొచ్చి మీకు అప్పగించినం. మీ కండ్ల ముందర ఉన్నాయి. ఇవాళ మంచినీటి బాధలు తీరాయి అని కేసీఆర్ పేర్కొన్నారు. మదన్‌లాల్ కొన్ని కోరికలు కోరారు. అవన్నీ కూడా చేయదగినటువంటి పనులే. ఢిల్లీ నుంచి వచ్చేటివి కావు. మన చేతిలో ఉండేటేవి. వైరా నియోజకవర్గం ప్రజల పక్షాన ఆయన కోరిన పనులు నేను చేయిస్తా. ఆయన సౌమ్యుడు, మంచివాడు. రాములు నాయక్ చాలా గొప్ప మనిషి. నేను రెక్వెస్ట్ చేసి ఈసారి మదన్‌లాల్‌కు అవకాశం ఇవ్వమంటే ఆయన కూడా పెద్ద మనసుతో సహకరించి, ఏ మాత్రం విబేధించకుండా రాములు నాయక్ సహృదయంతో పని చేస్తున్నారు. రాములు నాయక్ సముచితమైన గౌరవంలో ఉంటారు. బ్రహ్మాండమైన మెజార్టీ తీసుకురావాలి అని కేసీఆర్ కోరారు.



## బెదిరిస్తే భయపడం.. మేము ఫైటర్లమే..

### గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

సిద్దిపేట (వాయిస్ టుడే): గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని మల్లన సాగర్ భూ నిర్వాసితుల ఆర్అండ్ఆర్ కాలనీలో ఈటెల ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "బెదిరిస్తే భయపడం.. మేము ఫైటర్లం. ప్రజలకు అండగా ఉంటాం.. కాలికి ముళ్ళు గుచ్చితే పన్నుతో తిస్త. ఎవరైతే మల్లన్న సాగర్ భూ నిర్వాసితులను చెట్టుకొకలను పుట్టకొకలను చేశారో వాళ్ళే నా పై పోటీ చేసే దమ్ము లేక బీజేపోల్లను రానివ్వొద్దు అంటున్నారు. మీకు బాధ ఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టండి. ప్రభుత్వ విలువ ప్రకారం భూ నిర్వాసితులకు నష్టపరిహారం ఇస్తుంటే మార్కెట్ ధర ప్రకారం ఇవ్వాలని నేను అన్నా నా మాట వినలేదు. భూ నిర్వాతులకు భూములను దూరం చేసి వాళ్ళను అడ్డా మీద కూలీలను చేశారు. దౌర్జన్యాన్ని, పోలీసులను నమ్ముకున్నోల్లు ఎప్పటికీ బాగుపదరు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంవత్సరానికి నాలుగు సిలిండర్‌లు ఉచితంగా అధిస్తాం. అదే విధంగా కళ్యాణ లక్ష్మీ లక్ష నుంచి రెండు లక్షలకు పెంచుతాం. రూ.2100 ఉన్న వడ్లకి రూ.3100లకు పెంచుతూ మొత్తం ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేస్తాం" అని ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు.



## సంపద కలిగిన తెలంగాణా రాష్ట్రం నేడు అప్పుల పాలైంది

ముదిగొండ (వాయిస్ టుడే): ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గందశిరిలో మధిర కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన BRS ప్రభుత్వం పై ధ్వజమెత్తారు. సంపద కలిగిన తెలంగాణా రాష్ట్రం నేడు అప్పుల పాలైందని ఆయన మండిపడ్డారు. నీళ్ల కోసం తెలంగాణా తెచ్చుకుంటే ఒక్క చుక్క నీరు కూడా ఈ ప్రాంతానికి రాలేదన్నారు. లక్ష కోట్లు ఖర్చు చేసి గోదావరిపై కట్టిన కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టుల పరిస్థితి ఎలా ఉందో ప్రజలకు తెలుసని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని భట్టి విక్రమార్క అన్నారు.

## కాంగ్రెస్‌ను నమ్మితే కైలాసంలో పెద్ద పాము మింగినట్టు డమాల్ మంటం

సిద్దిపేట (వాయిస్ టుడే): కాలం అయినా కాకున్నా నేడు కాళేశ్వరం జలాలతో శనిగరం ప్రాజెక్టు ద్వారా రెండు పంటలకు నీళ్ళు వస్తున్నాయని మంత్రి హరీష్‌రావు అన్నారు. మంగళవారం కోహెడ మండల కేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే సతీష్ కుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం రోడ్ షోలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ.. మల్ల ఎలక్షన్లు రాగానే కాంగ్రెసోల్లు బయల్దేరారని.. కరోనా వచ్చినప్పుడు ప్రజలతో ఉన్నది తామే అని.. కాంగ్రెస్ నేతలు అప్పుడు ఎటు పోయారని ప్రశ్నించారు. కర్ణాటకలో కాంగ్రెస్ 5 గ్యారంటీలు అన్నారని.. ఇప్పుడు అక్కడ ప్రజలు అగ్గైయిపోయినం అంటున్నారన్నారు. గతంలో దొంగోలే వచ్చే కరెంట్‌తో నేను ఎట్లా సాగు చేస్తురో అని రైతులు పాటలు పడుకున్నారన్నారు. మూడు గంటల కరెంటు ఇస్తే 3 ఎకరాలు పరుతుందట, రేవంత్ రెడ్డికి హార్స్ పవర్ అంటే అర్థం తెలువదు అతను పీసీసీ అధ్యక్ష పదవి మీద కూర్చున్నారని మంత్రి విమర్శించారు.



## ప్రభుత్వం దేవుడికి ఇచ్చిన మాట తప్పింది



భద్రాద్రి కొత్తగూడెం (వాయిస్ టుడే): ఈ ప్రభుత్వం దేవుడికి ఇచ్చిన మాట తప్పిందని మాజీ మంత్రి తుమ్మల నాగేవ్వరరావు అన్నారు. నేడు చర్లలో కాంగ్రెస్ పార్టీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమంలో తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. సాక్షాత్తు శ్రీ రాముడు కొలువైన ఆలయం అభివృద్ధి పనులు వాగ్దానం అమలు కాలేదన్నారు. గోదావరి వరద బాధితులకు ఇచ్చిన హామీలు నెరవేరలేదన్నారు. భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆశీస్సులతో పూజ్యులు ఎన్టీఆర్ రాజకీయ అవకాశం ఇచ్చారని తుమ్మల పేర్కొన్నారు. భద్రాచలం డివిజన్‌లో గిరిజనులు, ఆదివాసుల అభివృద్ధికి కృషి చేశానన్నారు. భద్రాచలం కరకట్ట హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణంతో నాగరిక అభివృద్ధి వైపు నడిపించానన్నారు. తమపై నమ్మకం ఉంటే భద్రాచలం ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థి పోదెం వీరయ్యను గెలిపించాలని తుమ్మల కోరారు.



## కేసీఆర్.. రేవంత్ తోడు దొంగలు

### కల్వకుంట్ల కుటుంబంతో రేవంత్ పార్టనర్‌గా కొనసాగుతున్నారు :ఎంపీ ధర్మపురి అర్వింద్

కేసీఆర్... రేవంత్... తోడుదొంగలని, కామారెడ్డిలో కేసీఆర్‌ను గెలిపించేందుకు రేవంత్ పోటీ చేస్తున్నారని, బీసీలకు అన్యాయం చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను తరిమికొట్టాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పిలుపునిచ్చారు. కల్వకుంట్ల కుటుంబంతో రేవంత్ పార్టనర్‌గా కొనసాగుతున్నారని ఆయన ఆరోపించారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌లో యువశక్తి విజయ సంకల్పసభకు ఎంపీ ధర్మపురి అర్వింద్ హాజరయ్యారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్నిరకాలుగా దోచుకున్నాడన్నారు. కాంగ్రెస్ పార్టీకి మరో అవకాశం ఇస్తే కేసీఆర్‌ను మించి రాష్ట్రాన్ని దోచుకుంటారని ఆరోపించారు.. బోధన్‌లో బీజేపీని గెలిపించాలని, మూతబడిన ఫ్యాక్టరీలు తెరిపించే బాధ్యత బీజేపీదేనన్నారాయన... బీజేపీ గెలవగానే మూతబడిన ఫ్యాక్టరీలను తెరిపించి రైతులకు అండగా నిలుస్తామన్నారు.

## నగదు బదిలీపై ఐటీ - ఈడీ సీరియస్.. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల ఇళ్లలో సోదాలు




హైదరాబాద్: తెలంగాణలో ఎన్నికల వేళ భారీగా నగదు బదిలీపై ఐటీ - ఈడీ సీరియస్ యాక్షన్ తీసుకుంటోంది. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా 30 చోట్ల ఏకకాలంలో ఐటీ, ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలతో పాటు ప్రముఖ వ్యాపారుల లావాదేవీలపై ఐటీ విచారణ చేపట్టింది. తెలంగాణలోని మంచిర్యాల, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. కొమురం భీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోనూ ఐటీ సోదాలు జరుగుతున్నాయి. బీఆర్ఎస్ నేత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్ నివాసంలో అధికారులు సోదాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు శ్రీనివాస్ సన్నిహితునిగా ఉన్నారు. మరోవైపు మంచిర్యాలలో చెన్నూరు కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ వివేక్ నివాసంలో ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కోసం భారీగా నగదు బదిలీ అయిందన్న సమాచారంతో సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 13న విశాఖ ఇండస్ట్రీస్, విజిలెన్స్ సెక్యూరిటీ సంస్థల ఖాతాల్లోకి రూ. 8కోట్ల నగదు బదిలీ జరిగింది. గుర్తు తెలియని ఖాతా నుంచి నగదు బదిలీపై సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదులు అందాయి. రూ. 8కోట్ల నగదును ఫ్రీజ్ చేసి ఈసీ, ఐటీ, ఈడీ అధికారుల దృష్టికి పోలీసులు తీసుకెళ్లారు. పోలీసులిచ్చిన సమాచారం ఆధారంగా వివేక్ నివాసంలో ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు. హైదరాబాద్‌తో పాటు చెన్నూరులో ఈ సోదాలు కొనసాగుతున్నాయి. వివేక్, వినోద్ నివాసాలతో పాటు బంధువుల ఇళ్లలోనూ రైడ్ జరుగుతోంది.

## రన్‌వేపై అదుపుతప్పి సముద్రంలోకి దూసుకెళ్లిన భారీ విమానం..

అమెరికా నావికాదళానికి చెందిన ఓ భారీ విమానం రన్‌వేపై అదుపుతప్పి సముద్రంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన హవాయిలోని మెరైన్ కోర్ బేస్‌లో చోటు చేసుకుంది. సముద్రంలో బోటింగ్ చేస్తున్న వారు వెంటనే అప్రమత్తమై సహాయం చేయడంతో విమానంలోని సిబ్బంది ప్రాణాలతో బయటపడ్డారు.

సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో అమెరికా నౌకాదళానికి చెందిన పీ-8ఏ పొసెడాన్ విమానం రన్‌వేపై అదుపుతప్పి హవాయి సముద్రంలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో సముద్రంలో బోటింగ్ చేస్తున్న వారు విమానాన్ని చూసి ఒక్కసారిగా షాక్ అయ్యారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. విమానంలోని సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. విజిబిలిటీ తక్కువగా ఉండటం కారణంగానే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది.



వాయిస్ టుడే
హైదరాబాద్
మంగళవారం, 21 నవంబరు, 2023

# కేసీఆర్ సర్కార్ అవినీతిపై విచారణ జరిపిస్తాం

## కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్



హైదరాబాద్: తెలంగాణని సీఎం కేసీఆర్ అప్పుల పాలు చేశారని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై ఆమె ఆందోళ వ్యక్తం చేశారు. మంగళవారం నాడు జూబ్లీహిల్స్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ..."ఎన్నికల ప్రచారంలో నా మొదటి సమావేశం ఇది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎడ్యుకేటెడ్, ప్రొఫెషనల్స్‌తో పాటు అన్ని సెక్షన్స్ ఉంటాయి. తెలంగాణలో ఈ ఎలక్షన్స్ చాలా ముఖ్యమైనవి. ఈ ఎలక్షన్స్ ప్రాముఖ్యత ప్రజలకు తెలపాలి. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేయటంలో కేసీఆర్ సర్కార్ విఫలమైంది. కేసీఆర్ సర్కార్ అవినీతిపై విచారణ జరిపిస్తాం. బీసీ నేతను ముఖ్యమంత్రి చేసి తీరుతాం. ఎస్సీ వర్గీకరణపై ప్రధానమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటాం. నీళ్లు, నిధులు, నియామకాల.. తెలంగాణ ఆకాంక్ష నెరవేరలేదు. మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారు. హైదరాబాద్ లాంటి సిటీని.. నైపుణ్యం ఉన్న యువతను ఉపయోగించుకోవటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. రాష్ట్ర చేసిన అప్పులు రాబోయే తరాలకు భారంగా మారుతోంది. దళిత ముఖ్యమంత్రి సంగతి దేవుడెరుగు. డిప్యూటీ సీఎం రాజయ్యను ఆరు నెలలకే తొలగించారు. అక్షరాస్యతలో నేషనల్ యావరేజ్ కంటే తెలంగాణ వెనుకబడింది. కేసీఆర్ ఎన్మికల హామీ 3,116/- నిరుద్యోగ భృతి ఎక్కడ? కేసీఆర్ హయాంలో 6వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని బూతులు తిట్టే ప్రభుత్వం తెలంగాణకు అవసరమా? జనవరి 22వ తేదీన అయోధ్య రామమందిరం ప్రారంభిస్తాం" అని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.



## అధికారంలోకి రాగానే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య గెలుపు కాంక్షిస్తూ కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ కార్యకర్తల ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు హాజరయ్యారు. భద్రాచలం కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య గెలుపు కాంక్షిస్తూ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాజీ ఎంపీ పొంగులేటి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని, కాంగ్రెస్ పార్టీ హయాంలో గోదావరి వరద నీరు పట్టణంలోని ముంపు ప్రాంతాల్లోకి నీరు రాకుండా పూర్తి స్థాయిలో కరకట్ట నిర్మాణం చేస్తామన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు.

## జమిలితో అన్ని పార్టీలకు మేలు జరుగుతుంది: రామ్‌నాథ్ కోవింద్



రాయబరేలి: 'ఒకే దేశం-ఒకే ఎన్నిక'కు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మద్దతు పలికారు. జమిలి ఎన్నికలు దేశ ప్రయోజనాలతో ముడిపడిన అంశమని, ఏ పార్టీకైనా దీనితో ప్రయోజనమేనని అన్నారు. జమిలి ఎన్నికలపై అధ్యయనానికి కేంద్రం ఏర్పాటు చేసిన కమిటీకి రామ్‌నాథ్ కోవింద్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలిలో మంగళవారంనాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఏకకాలంలో ఎన్నికలకు (జమిలి) అన్ని గుర్తింపు పొందిన పార్టీలతోనూ తాను మాట్లాడామని, వారి సలహాలు, సూచనలు తీసుకున్నామని చెప్పారు. ప్రతి రాజకీయ పార్టీ ఏదో ఒక సమయంలో జమిలి ఎన్నికలను మద్దతు తెలిపాయని అన్నారు.

జమిలి ఎన్నికలు దేశ ప్రయోజనాలతో ముడిపడిన అంశమని, ఇందుకు అన్ని పార్టీలు నిర్మాణాత్మకంగా మద్దతు తెలపాలని మాజీ రాష్ట్రపతి కోరారు. జమిలి ఎన్నికలతో డబ్బు ఆదా అవుతుందని, దానిని అభివృద్ధి పనులకు ఉపయోగించడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, మున్సిపాలిటీలు, పంచాయతీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించే విషయాన్ని అధ్యయనం చేసి సాధ్యమైనంత త్వరగా సిఫారసులు అందజేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం 8 మంది సభ్యులతో కూడిన అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ తొలి సమావేశాన్ని సెప్టెంబర్ 23న రామ్‌నాథ్ కోవింద్ నిర్వహించారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, రాజ్యసభలో మాజీ విపక్ష నేత గులాం నబీ ఆజాద్, ఆర్థిక కమిషన్ మాజీ చైర్మన్ ఎన్‌కే సింగ్, మాజీ లోక్‌సభ సెక్రటరీ జనరల్ సుభాష్ సి కస్యప్, మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ సంజయ్ కొఠారి, ప్రముఖ న్యాయవాది హరీష్ సాల్వే ఈ వర్చువల్ మీటింగ్‌లో పాల్గొన్నారు.



## ఈసారి దుబ్బాక కోరుతున్నాం.. రఘునందన్ ఇంటికే..

సిద్దిపేట: ఎన్నికల ప్రచారంలో భాగంగా దుబ్బాక నియోజకవర్గం దౌల్తాబాద్‌లో బీఆర్ఎస్ యువజన గర్జనలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈ సారి దుబ్బాక కోరుతున్నాం.. రఘునందన్ ఇంటికే అంటూ వ్యాఖ్యలు చేశారు. రఘునందన్ రావు అనేక లుచ్చా మాటలు చెప్పారని.. ఇచ్చిన హామీలేవి అమలు చేయలేదని మండిపడ్డారు. ఆరోజు చెప్పిన లుచ్చా మాటలు మళ్ళీ చెబుతున్నారని అన్నారు. ఎన్నికల తరువాత అసైన్డ్ భూములకు పట్టాలు అందజేస్తామన్నారు. తెలంగాణ ఎవరి చేతుల్లో ఉంటే సురక్షితంగా ఉంటుందో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ హయాంలో కరెంట్ పరిస్థితి ఎలా ఉండేదో ఒక్క సారి గుర్తు చేసుకోవాలన్నారు. కాలిపోయే మోటార్లు, పేలిపోయే ట్రాన్స్ ఫార్మర్లు, ఎరువుల కొరతలు ఉండేవన్నారు. కరెంట్ ఎక్కడ ఉందో చూపాలని రేవంత్, కోమటిరెడ్డి అంటున్నారని.. దుబ్బాకకు వచ్చి కరెంట్ తీగలు పట్టుకుంటే తెలుస్తుంది కరెంట్ వస్తుందో, లేదో అంటూ మంత్రి సెటైర్ విసిరారు.



## కేటీఆర్‌పై ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు..

## చర్యలకు సన్నద్ధం!



హైదరాబాద్ (వాయిస్ టుడే): మంత్రి కేటీఆర్ ప్రచార తీరుపై ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. ప్రభుత్వ భవనాల్లో కేటీఆర్ ఇంటర్వ్యూలు, న్యూస్ పేపర్‌లో తప్పుడు ప్రకటన ఇవ్వడంపై కాంగ్రెస్ కంప్లైంట్ చేసింది. మూడు రోజుల పాటు కేటీఆర్‌ను ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వ భవనం (టి హబ్)లో విద్యార్థులు, యువతతో కేటీఆర్ మీటింగ్ పెట్టి ప్రచారం చేయడంపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నికల ప్రచారం చేయడం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని ఫిర్యాదులో కాంగ్రెస్ పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రావును కాంగ్రెస్ బృందం కలిసింది. కాంగ్రెస్ కంప్లైంట్ నేపథ్యంలో కేటీఆర్‌పై చర్యలకు తీసుకునేందుకు ఎన్నికల సంఘం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# ఎన్నికల సందర్భంగా ఐదు రాష్ట్రాల్లో ధన ప్రవాహం

### ఎన్నికలు ముగిసేనాటికి తనిఖీల్లో పట్టుబడే సొమ్ము మరింత పెరిగే ఛాన్స్



ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో ఇప్పటి వరకూ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఉద్దేశించిన 17వందల 60 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. అక్టోబరు 9న ఎన్నికలు ప్రకటించినప్పటి నుంచి ఇప్పటివరకూ ఐదు రాష్ట్రాల్లో నగదు, మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువుల రూపంలో ఈ మొత్తం పట్టుపడినట్లు ఎలక్షన్ కమిషన్ ప్రకటించింది. ఈ రాష్ట్రాల్లో 2018 ఎన్నికల్లో పట్టుబడిన మొత్తం కంటే ఈసారి పట్టుబడినది దాదాపు ఏడు రెట్లని పేర్కొంది. గత ఎన్నికల్లో ఈ రాష్ట్రాల్లో 239.15 కోట్ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను ఈసీ జప్తు చేసింది. 17వందల 60 కోట్లలో అత్యధికంగా తెలంగాణలో దాదాపు 659 కోట్ల విలువైన లెక్కచూపని నగదు, మద్యం, మాదక ద్రవ్యాలు, ఉచితాలు, ఇతరత్రా సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఈసీ వెల్లడించింది. తెలంగాణలో 659.2 కోట్లు పట్టుబడగా, అందులో 225.23 కోట్లు నగదు రూపేణా ఉన్నాయి. 86.82 కోట్ల విలువైన మద్యం, 103.74 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలు, 191.02 కోట్ల విలువైన బంగారం, వెండి, ఆభరణాలు, 52.41 కోట్ల విలువైన ఉచితంగా పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన వస్తువులను ఎన్నికల అధికారులు సీజ్‌చేశారు. మిజోరంలో నిర్వహించిన తనిఖీల్లో ఒక్క రూపాయి నగదు కానీ, విలువైన బంగారు, వెండి ఆభరణాలు కానీ దొరకలేదని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ రాష్ట్రంలో 29.82 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలు, 4.67 కోట్ల లిక్కర్, 15.16 కోట్ల విలువైన ఉచితాల వస్తు సామాగ్రిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈసారి స్టేట్, సెంట్రల్?ఏజెన్సీల మధ్య సమన్వయం, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ వ్యవస్థలో టెక్నాలజీ భాగస్వామ్యం పెంచామని, ఎన్నికలు ముగిసేనాటికి తనిఖీల్లో పట్టుబడే సొమ్ము మరింత పెరిగే అవకాశం ఉందని ఈసీ తెలిపింది. ఐదు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించినప్పుడే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్.. ప్రలోభ రహితంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని అభ్యర్థులకు, పార్టీలకు స్పష్టం చేసినట్లు ఈసీ పేర్కొంది. ఈసారి ఎన్నికల్లో ధన ప్రవాహం, ప్రలోభాలకు అడ్డుకట్ట వేయడానికి ఎలక్షన్ కమిషన్ ఎన్నికల వ్యయ పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా పర్యవేక్షణ ప్రక్రియలో సాంకేతికతను కూడా పొందుపరిచినట్లు తెలిపింది. అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో ఇప్పటికే మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరంలలో ఎలక్షన్లు ముగియగా రాజస్థాన్‌లో నవంబర్ 25, తెలంగాణలో నవంబర్ 30న పోలింగ్ జరగనుంది.



## డ్రైనేజీలోకి దిగిన ప్రపంచ కుబేరుడు.. దేనికోసమో తెలుసా..?




నవంబర్ 19న వరల్డ్ టాయిలెట్ డే. ఈ సందర్భంగా ఓ పిక్ ప్రపంచ వ్యాప్తంగా వైరల్ అవుతోంది. అదేంటంటే.. ప్రపంచ కుబేరుడు, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ మ్యాన్ హోల్‌లో దిగుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బిల్‌గేట్స్ ఏంటి? మురుగు కాలువలో దిగడమేంటి? అని ఆశ్చర్యంగా అనిపిస్తోంది కదా.. కానీ ఇది అక్షరాలా నిజం. బిల్‌గేట్స్ బ్రస్సెల్స్‌లోని సీవర్ మ్యూజియాన్ని సందర్శించే క్రమంలో ఆయన మ్యాన్‌హోల్‌లో దిగుతున్న వీడియో వైరల్ అవుతోంది.

ఆయన అండర్ గ్రౌండ్ మ్యూజియంలో పలువురు శాస్త్రవేత్తలతో సమావేశమయ్యారు. ఈ క్రమంలోనే నగరంలోని మురుగునీటి వ్యవస్థకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం.. 200-మైళ్ల మురుగు కాలువలు, ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నెట్‌వర్క్ అనేది నగరంలోని వ్యర్థాలను ప్రాసెస్ చేస్తుంది. ఈ సందర్భంగా బ్రస్సెల్స్‌లోని మురుగు నీటి వ్యవస్థతో పాటు మురుగు నీటి కారణంగా తలెత్తే సమస్యలను వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా తెలుసుకున్నానని బిల్‌గేట్స్ పోస్టు పెట్టారు. "బ్రసెల్‌లోని అండర్‌గ్రౌండ్ మ్యూజియంలో అన్ని విషయాలను నేను తెలుసుకున్నాను. మురుగునీటి వ్యవస్థకు సంబంధించిన చరిత్రను డాక్యుమెంట్ చేస్తున్నాను. 1800లో నగరంలోని మురుగు నీరు అంతా సెన్నే నదిలో డంప్ చేయడం జరిగింది. దీంతో భయంకరమైన కలరా వ్యాప్తి చెందింది. కానీ నేడు పరిస్థితులు మారిపోయాయి. 200-మైళ్ల డ్రైనేజ్ నెట్‌వర్క్, ట్రీట్‌మెంట్ ప్లాంట్లు నగరంలోని వ్యర్థాలను ప్రాసెస్ చేస్తాయి" అని వీడియోలో బిల్‌గేట్స్ తెలిపారు. మురుగునీటి సమస్యలపై జనాలకు బిల్‌గేట్స్ అవగాహన కల్పించడం ఇది తొలిసారేమీ కాదు. 2015లో మలాన్ని శుద్ధి చేసి దాని నుంచి శాస్త్రవేత్తలు తీసిన నీటిని తాగారు. అలాగే 2016లో పారిశుధ్యంపై అవగాహన కల్పించే యత్నం చేశారు.

# రాజస్థాన్‌లో కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల




జైపూర్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సిద్ధమవుతున్న రాజస్థాన్‌లో కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రకటించింది. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ మేనిఫెస్టోని విడుదల చేశారు. మళ్లీ అధికారంలోకి వస్తే కుల సర్వే చేపడతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. పంచాయతీ స్థాయిలో నియామకాలు చేపడతామని, సంక్షేమ పథకాలు ప్రవేశపెడతామని మేనిఫెస్టోలో పేర్కొంది. ప్రజల నుంచి అందిన సలహాలు, సూచనల ఆధారంగా ఎన్నికల హామీలను రూపొందించామని, 2018 ఎన్నికల హామీల్లో 96 శాతం నెరవేర్చామని ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ అన్నారు. ఆర్థికాభివృద్ధి విషయంలో ఉత్తర భారతదేశంలో రాజస్థాన్ మొదటి స్థానంలో ఉందని అశోక్ గెహ్లాట్ చెప్పారు. ఏడాది చివరి నాటికి రాజస్థాన్ ఆర్థిక స్థితి రూ.15 లక్షల కోట్లుగా ఉందని, 2023 నాటికి రూ.30 లక్షల కోట్లకు పెంచడమే లక్ష్యమని అన్నారు. కాగా 'జన్ ఘోష్న పత్ర' పేరిట మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతోపాటు రాజస్థాన్ డిప్యూటీ సీఎం సచిన్ పైలెట్ పాల్గొన్నారు.

నవంబర్ 25న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి వస్తే 'ఏడు గ్యారంటీలు' అమలు చేస్తామని కాంగ్రెస్ వాగ్దానం చేసింది. పంచాయతీ స్థాయిలో ఉద్యోగాలు, 4 లక్షల ఉద్యోగాలు, కుల గణనను ప్రధానంగా ఉన్నాయి.

- కుటుంబ పెద్దగా ఉన్న మహిళకు ఏడాదికి రూ.10 వేలు
- 1.04 కుటుంబాలకు కేవలం రూ.500లకే ఎల్‌పీజీ సిలిండర్
- పశు పోషకదారుల నుంచి కేజీ రూ.2 చొప్పున పేడ కొనుగోలు
- రూ.25 లక్షల - రూ.50 లక్షల వరకు 'చిరంజీవి హెల్త్ ఇన్సూరెన్స్
- ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ స్కీమ్ కోసం చట్టం
- ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్లు తీసుకునే విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు/ట్యాబ్స్
- సహజ విపత్తుల కారణంగా ఎవరైనా మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.15 లక్షల ఇన్సూరెన్స్

కాగా బీజేపీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు. బీజేపీ తమ పథకాలను కాపీ కొడుతోందని ఆయన ఆరోపించారు. బీజేపీ ఎన్ని వాగ్దానాలు చేసినా గెలిచేది కాంగ్రెస్సేనని అన్నారు. ఎలాంటి పరిస్థితులు ఉన్నా రాజస్థాన్‌లో తప్పకుండా కుల గణన చేపడతామన్నారు.